సాక్షి అనకాపల్లి

ఆదివారం । 14 । సెప్టెంబర్ । 2025



చెరువులో కోళ్ల కళేబరాలు

చేనులపాలెం కల్లాలు సమీపంలో సాగునీటి చెరువులో వందలాది కోళ్ల కళేబరాలను గుర్తు తెలియని వ్యక్తులు పడేశారు. 8లో



అప్పన్నకు నిత్యకల్యాణం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి బేడా మండపంలో శనివారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు.



సిరులతల్లికి తులసిపూజ

డాబాగార్డెన్స్(విశాఖ): బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం ఘనంగా తులసిపూజ నిర్వహించారు.

న్యూస్‌రీల్

రాజీ మార్గమే.. రాజమార్గం


- జిల్లా పదవ అదనపు న్యాయమూర్తి (ఇన్‌చార్జ్) కవిత



మాట్లాడుతున్న జిల్లా పదవ అదనపు న్యాయమూర్తి కవిత

అనకాపల్లి టౌన్: రాజీ మార్గమే రాజమార్గమని జిల్లా పదవ అదనపు న్యాయమూర్తి(ఇన్‌చార్జ్) ఎస్.కవిత తెలిపారు. స్థానిక మెయిన్ రోడ్డులోని న్యాయస్థానాల ఆవరణలో శనివారం జాతీయలోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనకాపల్లి న్యాయస్థానాల సముదాయంలో 1,524 కేసులు పరిష్కరించి, రికవరీ అయిన రూ.5,64,67,058 కక్షిదారులకు చెల్లించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా పదవ అడిషనల్ కోర్టులో 41 కేసులకు గాను రూ.3,65,68,000, అడిషనల్ సివిల్ కోర్టులో మూడు కేసులు, ఒకటవ అడిషినల్ సివిల్ కోర్టులో 663 కేసులకు గాను రూ.55,78,570, మూడవ అడిషనల్ సివిల్ కోర్టులో 425 కేసులకు గాను రూ.35,28,029, రెండవ తరగతి మేజిస్ట్రేట్ కోర్టులో 26 కేసులకు గాను రూ.1,14,430, ప్రిన్సిపల్ సివిల్ కోర్టు(సీనియర్ డివిజన్)లో 13 కేసులకు గాను రూ.69,68,029, ప్రిన్సిపల్ సివిల్(జూనియర్ డివిజన్)లో ఒక కేసుకు రూ.1,30,000, రెండవ అడిషనల్ సివిల్ కోర్టులో 351 కేసులకు గాను రూ.25,85,000, అడిషనల్ సివిల్ కోర్టులో ఒక కేసుకు గాను రూ.10 లక్షల చెల్లించామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయ మూర్తులు పి. నాగేశ్వరావు, జి.రామకృష్ణ, ఎ.రమేష్, బి.వి. విజయలక్ష్మి, నికిత సింగర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లా హరశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దేరు నుంచి 400 క్యూసెక్కులు విడుదల



మాడుగుల రూరల్: అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తుండడంతో జలాశయాల్లో నీటి మట్టాలు గణనీయంగా పెరుగుతున్నాయి. ప్రధాన జలాశయమైన పెద్దేరు రిజర్వాయర్ నుంచి శనివారం రాత్రి 400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్టు జలాశయం జేఈ సుధాకర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 137 మీటర్లు కాగా, ప్రస్తుతం 136.60 మీటర్లకు చేరింది. జలాశయంలోకి 518 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో స్పిల్‌వే గేట్ల ద్వారా 400 క్యూసెక్కులను దిగువకు విడుదల చేసినట్టు జేఈ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు.



రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛకు ముప్పు?



భారత రాజ్యాంగం పత్రికా స్వేచ్ఛ, భావ ప్రకటన స్వేచ్ఛా హక్కులను కల్పించింది. అయితే కూటమి ప్రభుత్వం ఈ హక్కులను అణచివేసే కుట్రలు చేస్తోంది. ఏ రాజకీయ పార్టీకి చెందిన నాయకులైనా మీడియా సమావేశాలు నిర్వహించి అనేక అంశాల గురించి మాట్లాడతారు. వాటిని ప్రజలకు వార్తల రూపంలో చేరవేయడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తారు. అంతమాత్రాన జర్నలిస్టులపై, వార్తలను ప్రచురించిన పత్రికలపై కేసులు నమోదు చేయడం సబబు కాదు. ఈ విషయంలో సాక్షి పత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై కేసులు నమోదు చేసి వేధించడం సరికాదు. సీఎం చంద్రబాబుకు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఉంది. ప్రజలు తనను గద్దె దింపుతారనే అభద్రతా భావంతోనే ఇప్పటివరకు సోషల్ మీడియా కార్యకర్తలపై, ఇప్పుడు సాక్షి మీడియాపై కేసులు పెడుతున్నారు. చంద్రబాబు చర్యలకు కాలమే సరైన సమాధానం చెబుతుంది. -కె.కె.రాజు, వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపితే వేధిస్తారా?



ప్రాథమిక హక్కుల్లో ఒకటైన భావ ప్రకటన స్వేచ్ఛను అణచివేసేందుకు కూటమి ప్రభుత్వం కుటిల ప్రయత్నాలు చేస్తోంది. ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో గవర్నర్, కేంద్ర హోంమంత్రి జోక్యం చేసుకుని పత్రికా స్వేచ్ఛను కాపాడాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని సందర్భంలో, ప్రజా సమస్యలను పట్టించుకోనప్పుడు.. ప్రజా గొంతుకగా మీడియా తన వాణిని వినిపిస్తుంది. దీనిని ప్రభుత్వాలు తమ లోపాలను సరిదిద్దుకునేందుకు ఒక మంచి అవకాశంగా భావించాలే తప్ప, మీడియా, జర్నలిస్టులపై అక్రమ కేసులు నమోదు చేయకూడదు. ఒకవేళ అదే చేస్తే, ఆ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నట్లే. చంద్రబాబు ప్రభుత్వం కూడా అదే చేస్తోంది. రైతు నుంచి యువత వరకూ అందరికీ అమలు చేయలేని హామీలు ఇచ్చి, ఇప్పుడు ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్న సాక్షిపై అక్రమ కేసులు పెట్టడం, సాక్షి ఎడిటర్‌పై అక్రమ కేసులు నమోదు చేసి వేధించడం సరికాదు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న చానళ్లు, పత్రికలపై వేధింపులు మానుకోవాలి. – వాసుపల్లి గణేష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే, విశాఖ దక్షిణ నియోజకవర్గం



యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల



- డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాల్లో తీవ్ర గందరగోళం
- తొలివిడత సీట్ల ఖరారు పలుమార్లు వాయిదా
- ఏయూ పరిధిలో 30వేల మంది విద్యార్థుల ఎదురుచూపులు
- విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న కూటమి ప్రభుత్వం
- ప్రవేశాలు జరగకపోవడంతో దిక్కుతోచని స్థితిలో యాజమాన్యాలు,విద్యార్థులు

డిగ్రీ అడ్మిషన్లు ఎప్పుడో !

యలమంచిలి రూరల్: ఇంటర్ ఫలితాలు విడుదలై ఐదు నెలలు కావస్తున్నా డిగ్రీ ప్రవేశాలు చేపట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. ఉన్నత విద్యామండలి,ఉన్నత విద్యాశాఖ అధికారుల అసంబద్ధ నిర్ణయాలతో ఈ ఏడాది డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాల్లో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎడతెగని జాప్యం చోటుచేసుకుంది. ఫలితంగా సెప్టెంబరు మూడోవారం వచ్చినా అడ్మిషన్లు జరగక, తరగతులు ప్రారంభం కాకపోవడంతో విద్యార్థులు,కళాశాలల యాజమాన్యాల్లో ఆందోళన నెలకొంది. ఇతర రాష్ట్రాల్లో ఇప్పటికే అన్ని విడతల డిగ్రీ ప్రవేశాలు పూర్తయి, తరగతులు జరుగుతున్నా..రాష్ట్రంలో ఇప్పటివరకు ప్రవేశాలు మొదలు కాకపోవడం కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యానికి పరాకాష్టగా విద్యావేత్తలు,విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. నారా లోకేష్ మంత్రిగా ఉన్న విద్యాశాఖలో డిగ్రీ ప్రవేశాల పరిస్థితి ఇలా ఉండడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమ పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

సీట్ల కేటాయింపు రెండు సార్లు వాయిదా..

ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో 191 వరకు డిగ్రీ కళాశాలలున్నాయి.వీటిలో ఏటా 30వేల వరకు విద్యార్థులు వివిధ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు పొందుతారు.ఈ ఏడాది డిగ్రీ విద్యలో సంస్కరణల పేరిట కూటమి ప్రభుత్వం తొలుత డబుల్ మేజర్ విధానం తెచ్చేందుకు మూడు నెలల క్రితం షెడ్యూల్ ఇచ్చి కళాశాలల యాజమాన్యాల నుంచి దరఖాస్తులు తీసుకుంది.ఈ ప్రక్రియ అంతా ముగిసిన తర్వాత మళ్లీ పాత విధానానికే మొగ్గు చూపి సింగిల్ మేజర్ విధానానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో మళ్లీ కళాశాలల యాజమాన్యాలను కొత్తగా కోర్సుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఉన్నత విద్యా మండలి షెడ్యూల్ ఇచ్చింది.ఇదంతా పూర్తయ్యాక కళాశాలలకు అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోవాలని హడావుడి చేశారు.ఈ ప్రక్రియ పూర్తయ్యాక గత నెల 20వ తేదీన ఆన్‌లైన్ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేశారు.ఆగస్టు 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ప్రవేశాల రిజిస్ట్రేషన్లు ప్రారంభమవుతాయని,ఆగస్టు 24 నుంచి 28 వరకు వెబ్ ఆప్షన్లకు గడువు ఇచ్చారు.సెప్టెంబరు 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కావాల్సి ఉంది.అయితే ప్రవేశాల రిజిస్ట్రేషన్ల కోసం నిర్దేశించిన ఓఏఎండీసీ వెబ్‌సైట్ సాంకేతిక లోపంతో సకాలంలో తెరుచుకోకపోవడంతో ఈ నెల 3వ తేదీ వరకు ప్రవేశాల రిజిస్ట్రేషన్లకు,ఈ నెల 4వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవడానికి గడువు పొడిగించారు.ఈ నెల 8వ తేదీన సీట్ల కేటాయింపు,కళాశాలల్లో విద్యార్థుల రిపోర్టింగ్‌కు గడువు ఇచ్చారు.ఈ నెల 9వ తేదీన డిగ్రీలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయని తాజాగా ఇచ్చిన షెడ్యూల్‌లో పేర్కొన్నారు. ఈ గడువు కూడా పూర్తయినప్పటికీ శనివారం వరకు విద్యార్థులకు సీట్ల కేటాయింపు పూర్తికాలేదు.ఆదివారం రాత్రి గానీ సోమవారం గానీ సీట్ల కేటాయింపు జరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మొదటి విడత సీట్ల కేటాయింపే ఇప్పటివరకు పూర్తి కాకపోవడంతో రెండు,మూడు విడతల ప్రవేశాలు, స్పాట్,యాజమాన్య కోటా ప్రవేశాలు జరగడానికి మరికొంత జాప్యం జరిగే అవకాశం ఉంది.

ప్రవేశాల్లో జాప్యానికి తోడు మొదటి సంవత్సరం సిలబస్, సబ్జెక్ట్ క్రెడిట్లలో మార్పులు చేశారు. ప్రవేశాలు పూర్తయి,తరగతులు ప్రారంభమయ్యే సమయానికి మార్కెట్లో పుస్తకాలు అందుబాటులోకి వచ్చే అవకాశం లేదు.ఈ ప్రభావం విద్యార్థులపై పడే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయని విద్యా నిపుణులు చెబుతున్నారు.ఇప్పటికే ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం ప్రవేశాలు పూర్తి కావడంతో ఈ ఏడాది డిగ్రీ ప్రవేశాల్లో భారీగా తగ్గుదల ఉంటుందన్న ఆందోళనను ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు వ్యక్తం చేస్తున్నాయి.

సగం విద్యా సంవత్సరం గడిచిపోయింది



గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది డిగ్రీ ప్రవేశాల ప్రక్రియలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. కూటమి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలే దీనికి కారణం. ఇప్పటికే సగం విద్యా సంవత్సరం గడిచిపోయింది.మిగిలిన విద్యార్థులంతా త్వరలో సెమిస్టర్ పరీక్షలు రాయనున్నారు.కానీ డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు సిలబస్ ఎప్పుడు పూర్తి చేస్తారో?పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారో తెలియని గందరగోళం నెలకొంది.ప్రవేశాల్లో జాప్యం కారణంగా విద్యార్థులు నష్టపోతున్నారు.ఇంటర్ ఫలితాలు విడుదలై ఐదు నెలలు గడుస్తున్నా డిగ్రీలో ప్రవేశాలు చేపట్టకపోవడం కూటమి ప్రభుత్వ వైఫల్యంగా కనిపిస్తోంది.

– మైలపల్లి బాలాజీ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే జాప్యం



కూటమి ప్రభుత్వం డిగ్రీ విద్యార్థులతో ఆటలాడుకుంటోంది.ఐదు నెలలుగా ప్రవేశాలకోసం విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. అడ్మిషన్లలో తీవ్ర జాప్యం కారణంగా గ్రామీణ ప్రాంత, పేద విద్యార్థులు బాగా నష్టపోతారు.కొత్తగా డిగ్రీ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు ఒక్కో సెమిస్టర్‌కు ఆరు నెలల కాల వ్యవధి ఇవ్వాలి.లేకపోతే థియరీ పరీక్షల్లో ఉత్తీర్ణులు కాలేకపోతున్నారు.ఇప్పటికైనా డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ పూర్తి చేయాలి.కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఇలాంటి పరిస్థితి ఏర్పడింది.అడ్మిషన్ల ప్రక్రియ ఆలస్యం కావడం వల్ల భవిష్యత్తులో విద్యార్థుల ఉపాధి అవకాశాలు కూడా దెబ్బతింటాయి.

– బి బాబ్జీ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు

కార్యదర్శుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా దాలినాయుడు



నూతన కార్యవర్గం

అనకాపల్లి టౌన్: పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా పి.దాలినాయుడు(రావికమతం) ఎన్నికయ్యారు. స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శనివారం పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య ఎన్నికలు జరిగాయి. ప్రధాన కార్యదర్శిగా కరణం నాగేశ్వరావు(అచ్యుతాపురం), ఉపాధ్యక్షుడిగా ఎ.దిలీప్ కుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలుగా అనంత ఉమాదేవి, సంయుక్త కార్యదర్శిగా కె.సూర్యకళ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బి.చిన్నోడు, కోశాధికారిగా ఆర్.పి. నాయుడు, సంయుక్త కోశాధికారిగా ఎస్.నాత్తనియల్ ఎన్నికయ్యారు. అనంతరం కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు. ఈ ఎన్నికలు ఏజీఎన్‌జీజీఏ విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, జిల్లా జనరల్ సెక్రటరీ ఆర్.రవిశంకర్, ఏపీ గెజిటెడ్ అండ్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్, సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కె.సతీష్ ఆధ్వర్యంలో జరిగాయి.

కూటమిగా ఉద్యమిస్తాం!

విద్యుత్ ఉద్యోగ సంఘాల అల్టిమేటం

- 15 నుంచి ఉద్యమ కార్యాచరణ అమలు
- 22 నాటికి దిగిరాకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక

సాక్షి, విశాఖపట్నం: మాయమాటలతో అన్ని వర్గాలను మభ్య పెట్టి.. అందలమెక్కిన కూటమి ప్రభుత్వం.. విద్యుత్ ఉద్యోగుల నోట్లో కూడా మట్టి కొడుతోంది. తమ విజ్ఞప్తులు పట్టించుకోండంటూ చేసిన ఆర్తనాదాలు సర్కార్ చెవికెక్కడం లేదు. దీంతో విద్యుత్ ఉద్యోగులు 'కూటమి'గా ఉద్యమించేందుకు సిద్ధమవుతున్నారు. ఈపీడీసీఎల్‌లో ఏళ్ల తరబడి పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న వారు.. ఎప్పటికైనా శాశ్వత ఉద్యోగి కాకపోతానా అని ఎదురు చూస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు.. ఇలా ప్రతి విభాగంలోనూ ఉద్యోగులు ఉద్యమించేందుకు నడుం బిగించారు. రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసిన న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే ఆందోళన బాట పడతామంటూ విద్యుత్ ఉద్యోగ సంఘాల జేఏసీ ముందస్తు హెచ్చరికలు చేసింది. తాము నిర్దేశించిన గడువులోగా డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం అడుగులు వేయకపోతే దశల వారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పేర్కొంది.

ఐదు ప్రధాన డిమాండ్లు సహా..

విద్యుత్ ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రభుత్వానికి తమ డిమాండ్ నోటీసుతోపాటు ఆందోళన కార్యాచరణ వివరాలను అందజేసింది. ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్‌కు డిమాండ్ల నోటీసును నేతలు అందజేశారు.



సీఎండీ పృథ్వీతేజ్‌కు డిమాండ్ల నోటీస్ అందజేస్తున్న జేఏసీ నేతలు(ఫైల్)

ముఖ్యంగా ప్రభుత్వం డిమాండ్లు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి.. ఇంతవరకూ అమలు చేయని నిర్ణయాలతోపాటు సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న వృత్తి, ఉద్యోగ పరమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ఐదు ప్రధాన డిమాండ్లతోపాటు.. ఇతర డిమాండ్ల పరిష్కారానికి వీలైనంత త్వరగా చర్యలు తీసుకోవాలని కోరారు.

జేఏసీ డిమాండ్లలో ప్రధానమైనవి..

- 1999 ఫిబ్రవరి 1 నుంచి 2004 మధ్యలో డిస్కంలో చేరిన వారికి ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలి.
- 1999 నుంచి 2004 మధ్య విధుల్లో చేరిన రాష్ట్ర వ్యాప్తంగా 5,311 మంది ఉద్యోగుల గోడును ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇందులో ఏపీ ఈపీడీసీఎల్ పరిధిలో 1,573 మంది ఉండగా.. ఏపీ ట్రాన్స్‌కో పరిధిలో 347, జెన్‌కోలో 932, సీపీడీసీఎల్‌లో 835, ఎస్‌పీడీసీఎల్‌లో 1,623 మంది ఉద్యోగులు దీని కోసం ఎదురుచూస్తున్నారు.
- ప్రస్తుత ఉద్యోగులతోపాటు రిటైర్డ్ ఉద్యోగులకు గ్రూప్ మెడిక్లెయిమ్ పాలసీని అందుబాటులోకి తేవాలి.
- ట్రాన్స్‌కో, జెన్‌కోతోపాటు డిస్కంల పరిధిలో విధి నిర్వహణలో మృతి చెందిన ఉద్యోగుల కుటుంబానికి కారుణ్య నియామకాలు అమలు చేయాలి
- కాంట్రాక్ట్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి.. థర్డ్ పార్టీ ద్వారా కాకుండా నేరుగా వేతనాలు అమలు చేయాలి. 2023 ఆగస్టులో ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం.. కాంట్రాక్టు కార్మికులు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు సమానంగా ఉండాలి.
- డిస్కంల పరిధిలో ఖాళీగా ఉన్న అన్ని క్యాడర్ల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి. పెరుగుతున్న విద్యుత్ వినియోగం, పనిని దృష్టిలో పెట్టుకొని అదనపు పోస్టులు మంజూరు చేయాలి.
- పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను మంజూరు చేయాలి. తద్వారా వేలాది మంది ఉద్యోగుల ఆర్థిక కష్టాలు తొలగిపోతాయని జేఏసీ స్పష్టం చేసింది.



ఉద్యమ కార్యాచరణ ఇలా..

- ఈ నెల 15, 16 తేదీల్లో బ్లాక్ బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కానున్నారు.
- 17, 18 తేదీల్లో అన్ని సర్కిల్స్ ప్రధాన కార్యాలయాలు, జెనరేటింగ్ స్టేషన్లలో లంచ్ సమయంలో నిరసన ప్రదర్శనలు.
- 19, 20 తేదీల్లో అన్ని సర్కిల్స్ ప్రధాన కార్యాలయాలు, జెనరేటింగ్ స్టేషన్లలో రిలే నిరాహార దీక్షలు.
- 22న శాంతి ర్యాలీలు నిర్వహిస్తూ కలెక్టర్‌కు మెమొరాండం అందించనున్నారు. అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని జేఏసీ నేతలు హెచ్చరించారు.

మా కుమారుడిది

ముమ్మాటికీ హత్యే..!

- పక్కా స్కెచ్‌తోనే చెన్నై తీసుకెళ్లి హతమార్చారు..
- ప్రేమించాడని నెపంతోనే యువతి కుటుంబ సభ్యులు ఘాతుకం
- తమ కుమారుడి మృతిపై నిష్పాక్షికంగా విచారణ చేపట్టాలి
- మృతుడు నవీన్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల డిమాండ్
- కాశీపురంలో అశ్రునయనాల నడుమ అంత్యక్రియలు



నవీన్ ఫొటోలు చూస్తూ రోదిస్తున్న తల్లిదండ్రులు రాంబాబు, విజయ, చెల్లి రేష్మా, (ఇన్‌సెట్) మృతుడు డెక్కా నవీన్(ఫైల్)

దేవరాపల్లి: తమ కుమారుడు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని, ఇది ముమ్మాటికే హత్యేనని దేవరాపల్లి మండలం కాశీపురానికి చెందిన డెక్క నవీన్ తల్లిదండ్రులు చెబుతున్నారు. డెక్క నవీన్(23) చెన్నైలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంగతి తెలిసిందే. స్నేహితులతో కలిసి తీర్థయాత్రకు వెళ్లిన తమ కుమారుడు నవీన్ మేడ మీద నుంచి కింద పడి చనిపోయాడంటూ ఓ యువతి ఫోన్ నుంచి మరో యువకుడు ఫోన్ చేసి చెప్పడం పట్ల వారు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తమ కుమారుడు ప్రేమించిన రాంబిల్లి మండలం వెంకటాపురానికి చెందిన యువతితో పాటు ఆమె తల్లి, వారి బంధువులు పథకం ప్రకారం తమ కుమారుడిని తీర్థ యాత్ర పేరుతో తీసుకెళ్లి హతమార్చారని మృతుడి తల్లిదండ్రులు రాంబాబు, విజయ, చెల్లెలు రేష్మ ఆరోపించారు. నవీన్ మృతిపై నిష్పాక్షికంగా విచారణ చేసి దోషుల్ని కఠినంగా శిక్షించాలంటూ వారు డిమాండ్ చేశారు. ప్రేమిస్తే ఇంత దారుణంగా హతమారుస్తారా అంటూ గుండెలవిసేలా రోదించారు. తమకు న్యాయం జరిగేంత వరకు న్యాయ పోరాటం చేస్తామన్నారు. హోంమంత్రిని, ఎస్పీని, ఎమ్మెల్యేను కలిసి తమ కుమారుడి మృతిపై విచారణ చేసి న్యాయం చేయమని కోరతామని శనివారం విలేకర్లకు మృతుడి తల్లిదండ్రులు తెలిపారు.

బతుకుతెరువు కోసం అచ్యుతాపురం వలస

కాశీపురానికి చెందిన నవీన్ కుటుంబం సుమారు 12 సంవత్సరాల క్రితం బతుకుతెరువు కోసం అచ్యుతాపురం మండలం చినపూడి గ్రామానికి వలస వెళ్లారు. నవీన్ తండ్రి రాంబాబు అక్కడ ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ పిల్లలను చదివిస్తున్నారు. ఇంటర్, ఐటీఐ చదివిన నవీన్ అథ్లెటిక్స్‌లో జాతీయ స్థాయి క్రీడాకారుడిగా ఎదిగి రాణిస్తున్నాడు. అతను చదువుకునే సమయంలో తనతో చదివిన అదే ప్రాంతానికి చెందిన ఓ యువతితో స్నేహం ఏర్పడింది. అది



నవీన్ మృతదేహం

ప్రేమగా మారింది. ఆమె మరో రాష్ట్రంలో చదువుతుండగా, నవీన్ రెండు నెలల కిందట తమ కుటుంబం నివాసం ఉంటున్న ప్రాంతంలోని ఓ ప్రైవేటు కంపెనీలో చిరు ఉద్యోగంలో చేరాడు. ఈ క్రమంలో స్నేహితులతో కలిసి తీర్థయాత్రలకు వెళుతున్నానంటూ నవీన్ తన తల్లికి చెప్పి ఈ నెల 8వ తేదీ ఉదయం 5.30 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. ఎప్పటికప్పుడు తల్లికి ఫోన్ చేసేవాడు. 10న ఉదయం 11 గంటల ప్రాంతంలో అరుణాచలం ఆలయానికి వెళ్లిన నవీన్ తన తల్లితో అక్కడి నుంచే వీడియో కాల్ చేసి మాట్లాడాడు. అదే రోజు రాత్రి 9.30 గంటల ప్రాంతంలో నవీన్‌కి తల్లి విజయ ఫోన్ చేయగా, చెన్నై వెళ్తున్నామంటూ చెప్పాడు. ఈ నెల 11న (గురువారం) ఉదయం తన కుమారుడు ప్రేమిస్తున్న యువతి ఫోన్‌తో మరో యువకుడు మాట్లాడుతూ నవీన్ మేడపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడని తల్లి విజయకు చెప్పారు.

కాశీపురంలో విషాదఛాయలు

నవీన్ మృతితో స్వగ్రామం కాశీపురంలో విషాదఛాయలు అలముకున్నాయి. చెన్నై నుంచి నవీన్ మృతదేహాన్ని శనివారం ఉదయం కాశీపురానికి తీసుకువచ్చారు. ఆనందపురం నుంచి నవీన్ స్నేహితులు, కుటుంబ సభ్యులు బైక్ ర్యాలీతో స్వగ్రామం తీసుకువచ్చారు. కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు భోరున విలపించిన తీరు అందర్నీ కంటనీరు పెట్టించింది. తమలాంటి కడుపు కోత మరెవ్వరికి రాకూడదంటూ మృతుడి తల్లి రోదించింది. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, అశ్రునయనాల మధ్య కాశీపురం శ్మశాన వాటికలో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు.

చెన్నైలో కేసు నమోదు

నవీన్ మృతిపై అతని మేనమామ నాళం వాసు చెన్నైలోని కె-10 కొయంబేడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహానికి పంచనామా, పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా హత్య, ఆత్మహత్య అని నిర్ధారణకు వస్తామని పోలీసులు చెప్పినట్లు సమాచారం.

క్లుప్తంగా

కళా ఉత్సవ పోటీలకు కాశీపురం విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ పోటీలకు ఎంపికైన కాశీపురం హైస్కూల్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న నిర్వాహకులు

దేవరాపల్లి: రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ పోటీలకు కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు స్థానిక హైస్కూల్ హెచ్ఎం ఆర్.సుజాత తెలిపారు. రాష్ట్ర విద్యా పరిశోధన మండలి ఆధ్వర్యంలో సర్వ శిక్ష అభియాన్ ఈ నెల 11, 12 తేదీల్లో భీమునిపట్నంలోని జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థలో కళా ఉత్సవ పోటీలు నిర్వహించింది. మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్, కథా కథన పోటీల్లో కాశీపురం హైస్కూల్ విద్యార్థినీవిద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. సామూహిక నృత్యం, లఘు నాటిక పోటీల్లో తృతీయ స్థానం పొందారని, వీరందరికీ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ చేతులు మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారని స్థానిక హెచ్ఎం సుజాత తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థినీ విద్యార్థులు వచ్చే నెలలో అమరావతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. విజేతలుగా నిలిచిన పటాన్ రఫీ, కొత్త గిరిష్మా, తిరుమని రిషిత కమల, మేడపురెడ్డి జ్యోష్న, ఆతవ లలితశ్రీ, దోసూరి ధనలక్ష్మి, పల్ల తరుణ్, హరి వర్ధన్‌లతో పాటు గైడ్ టీచర్ కొట్టాన రాంబాబును హెచ్ఎం ఆర్.సుజాత అభినందించారు.

12 అడుగుల భారీ గిరినాగు పట్టివేత



పట్టుకున్న గిరినాగుతో స్నేక్ క్యాచర్లు

దేవరాపల్లి: మండలంలోని రైవాడ జలాశయం వద్ద భారీ గిరి నాగు శుక్రవారం సాయంత్రం కలకలం రేపింది. సుమారు 12 అడుగుల పొడవు ఉన్న ఈ పాము స్థానిక యువకుల కంట పడింది. వెంటనే వారు స్నేక్ క్యాచర్ కృష్ణకు సమాచారం అందించారు. అయితే ఆయన అందుబాటులో లేక పోవడంతో ఈస్టర్న్ ఘాట్ వైల్డ్ లైఫ్ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని సుమారు గంట పాటు శ్రమించి రాళ్ల మధ్యలో ఉన్న సర్పాన్ని అతి కష్టం మీద పట్టుకున్నారు. అనంతరం దట్టమైన అటవీ ప్రాంతంలో విడిచి పెట్టారు. దీంతో స్థానిక రైతులు, వేటదారులు, పర్యాటకులు ఊపిరి పీల్చుకున్నారు.

సాగునీటి చెరువులో కోళ్ల కళేబరాలు

- గుట్టలు గుట్టలుగా పడి ఉన్న మృతి చెందిన కోళ్లు
- తీవ్ర దుర్వాసనతో రైతుల అవస్థలు



చెరువులో పడేసిన మృతిచెందిన కోళ్లు

దేవరాపల్లి: మండలంలోని చేనులపాలెం కల్లాలు సమీపంలో సాగునీటి చెరువులో వందలాది కోళ్ల కళేబరాలను గుర్తు తెలియని వ్యక్తులు పడేశారు. రైవాడ పంటకాలువకు, తారురోడ్డుకు ఆనుకుని ఉన్న చెరువులో చనిపోయిన కోళ్లను గుట్టలు గుట్టలుగా రాత్రి సమయంలో పడేయడంతో అవి కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్నాయి. పౌల్ట్రీ యజమానులే మృతి చెందిన కోళ్లను పడేసి ఉంటారని, తీవ్ర దుర్వాసన వెద జల్లడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల బెడద కూడా ఎక్కువైందని వారు వాపోయారు. చెరువులో మృతి చెందిన కోళ్లు పడేసిన ప్రదేశాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న శనివారం పరిశీలించారు. పౌల్ట్రీ యజమానులే వీటిని పడేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. వెంటనే అధికార్లు చొరవ తీసుకుని కోళ్ల వ్యర్థాలను తొలగించి ప్రజల ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై మండల పశు వైద్యాధికారి జి. గాయత్రీదేవిని వివరణ కోరగా మృతి చెందిన కోళ్ల కారణంగా ఇటు రైతులకు, అటు పశువులకు అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. కోళ్లు మృతి చెందితే పూడ్చాలి తప్ప ఇలా బహిరంగంగా చెరువులు, కాలువల్లో పడేయటం సరి కాదని తెలిపారు. అలాంటి వారి కఠినచర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

వేయి కళ్లతో ఎదురుచూపులు

- 15న డీఎస్సీ తుది ఎంపిక జాబితా?
- 19న అమరావతిలో అందించేందుకు ఏర్పాట్లు!

ఆరిలోవ: ఉమ్మడి విశాఖ జిల్లాలో డీఎస్సీ–2025కు ఎంపికైన అభ్యర్థుల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడనుంది. ఈ నెల 19న అమరావతిలో సీఎం చేతుల మీదుగా వారికి నియామక పత్రాలు అందజేయడానికి విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి అభ్యర్థులను ప్రత్యేకంగా అమరావతికి తీసుకు వెళ్లేందుకు రవాణా ఏర్పాట్లు చేస్తున్నామని డీఈవో ఎస్.ప్రేమకుమార్ శనివారం తెలిపారు. ఈ నెల 15న డీఎస్సీ తుది ఎంపిక జాబితా విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. అప్పటి నుంచి ఎంపికైన అభ్యర్థులకు ఆహ్వాన పత్రాలు, మెసేజ్‌లు అందుతాయన్నారు. ఈ నెల 18 మధ్యాహ్నం ఇక్కడి నుంచి అమరావతికి బయలు దేరడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. అయితే.. ధ్రువపత్రాల పరిశీలన సమయంలో కొందరికి అర్ధరాత్రి వేళ సందేశాలు వచ్చిన అనుభవంతో.. ఈసారి కూడా అలా ఆలస్యమైతే జిల్లా నలుమూలల నుంచి సకాలంలో అమరావతికి బయలుదేరగలమా అని ఆందోళన చెందుతున్నారు. గతంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయాల్లోనే కేంద్రంలోనే నియామక పత్రాలు ఇచ్చేవారని, అది ఎంతో సౌకర్యంగా ఉండేదని పలువురు గుర్తుచేసుకుంటున్నారు. కాగా.. డీఎస్సీ–2025 ప్రక్రియ ప్రారంభం నుంచి అభ్యర్థులు అనేక గందరగోళాలను, అడ్డంకులను ఎదుర్కొన్నారు. నోటిఫికేషన్ మొదలుకుని, ఫలితాల వెల్లడి, ధ్రువ పత్రాల పరిశీలన వరకు పలు దశల్లో జాప్యం, వివాదాలు చోటుచేసుకున్నాయి. వివాహితల ధ్రువపత్రాలు, నకిలీ సదరం సర్టిఫికెట్లు వంటి సమస్యలను అధిగమించి ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేసుకున్న అభ్యర్థులు, ఇప్పుడు తుది నియామకాల కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థినుల ధర్నా



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న విద్యార్థినులు

అనకాపల్లి: నర్సీపట్నం మండలం వేములపూడి బీసీ బాలికల వసతి గృహంలో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థిని ఆర్.హాసిని మృతిపై పోస్టుమార్టం నివేదిక ఇవ్వాలని, ఆమె కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా మహిళా విభాగం కన్వీనర్ వెంకటలక్ష్మి డిమాండ్ చేశారు. అనకాపల్లి మండలం తుమ్మపాల పంచాయతీ చిన్నబాబు కాలనీ బీసీ మహిళా వసతి గృహం వద్ద శనివారం విద్యార్థినులు ధర్నా చేపట్టారు. ఆమె మాట్లాడుతూ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సొంత నియోజకవర్గంలో జరిగిన ఈ సంఘటనపై ఆయన నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. విద్యార్థిని మృతిపై ప్రజాప్రతినిధులు, అధికారుల్లో చలనం లేకపోవడం శోచనీయమన్నారు. వసతి గృహాల్లో సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలకు శ్రీకారం చుడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సీతా, రాధ, యోగిత, భవాని, భాగ్యశ్రీ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థిని మృతిపై కేసు నమోదు

నర్సీపట్నం: మండలంలోని వేములపూడి బీసీ బాలికల వసతిగృహ విద్యార్థిని మృతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మాకవరపాలెం మండలం బూరుగుపాలెంకు చెందిన ఆర్.హాసిని(13) వేములపూడి హాస్టల్‌లో చదువుతూ ఈ నెల 12న ఆకస్మికంగా మృతి చెందిన విషయం తెలిసిందే. విద్యార్థి మృతిపై తల్లి నాగమణి ఫిర్యాదు చేసింది. దీంతో అనుమానాస్పద కేసుగా నమోదు చేశారు. శనివారం మృతదేహానికి శవ పరీక్ష నిర్వహించి బంధువులకు అప్పగించారు. బాలిక మృతి కేసును తానే స్వయంగా దర్యాప్తు చేస్తున్నానని డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు.

17 వరకు 'బార్' దరఖాస్తు గడువు పొడిగింపు

అనకాపల్లి టౌన్: నర్సీపట్నం పట్టణ పరిధిలో బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటుకు దరఖాస్తు గడువును ఈ నెల 17వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వి.సుధీర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు రూ. 5 లక్షల నాన్ రిఫండబుల్ దరఖాస్తు రుసుం, రూ. 10 వేల ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి, నిర్ణీత గడువులోగా తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో గానీ హైబ్రిడ్ విధానం ద్వారా జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో సమర్పించాలని ఆయన కోరారు.

లోక్ అదాలత్‌లో 738 కేసుల పరిష్కారం



కేసులను పరిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి పి.షియాజ్ ఖాన్, జూనియర్ సివిల్ జడ్జి శ్రీభరణి

నర్సీపట్నం: జాతీయ లోక్‌అదాలత్‌ను స్థానిక కోర్టులో శనివారం నిర్వహించారు. ఈ అదాలత్‌లో 738 కేసులు పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్ ఖాన్ తెలిపారు. లోక్‌అదాలత్‌లో రాజీపడిన క్రిమినల్, సివిల్, కుటుంబ వివాదాలు, చెక్ బౌన్స్, ప్రమాదాలు, బ్యాంకుల కేసులను సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్ ఖాన్, జూనియర్ సివిల్ జడ్జి శ్రీభరణి పరిష్కరించారు. రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవటం ద్వారా కక్షిదారుల మధ్య బేధాభిప్రాయాలు ఏర్పడవని షియాజ్ ఖాన్ అన్నారు. సమయం వృథా కాకుండా రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవటం ఉత్తమమని సూచించారు.

అభివృద్ధికి దూరమైన పేదలు

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్



మాట్లాడుతున్న బందెల గౌతమ్‌కుమార్

అనకాపల్లి: అధికార పార్టీ నాయకులు సంక్షేమ పథకాల పేరుతో పేదలను, సామాన్యులను అభివృద్ధికి దూరంగా ఉంచుతూ నిరంతరం యాచకులుగా చూస్తున్నారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ వాపోయారు. స్థానిక విజయ రెసిడెన్సీ హాల్లో శనివారం పార్టీ జిల్లా విస్తృత స్థాయి (బహుజన సంకల్ప సభ) సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఓట్లతో పెత్తందారులు గెలిచి మనపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో వారికి ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోను కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కొల్లాబత్తుల సత్యం, కరణం తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అనాథ బాలలకు శిశు గృహాల్లో ఆశ్రయం

కోటవురట్ల: జిల్లాలో వివిధ కారణాల వల్ల అనాథలుగా మారిన, నిరాధరణకు గురైన పిల్లలకు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ రక్షణగా నిలిచి, ఆశ్రయం కల్పించనున్నట్లు జిల్లా బాలల పరిరక్షణ కమిటీ ప్రతినిధి డి.లోవరాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయిన బాల బాలికలు, పోషణ భారంతో విడిచి పెట్టబడిన పిల్లలు ఉంటే వారిని అప్పగిస్తే ఉమ్మడి విశాఖ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ కె.లక్ష్మి రాధ ఆధ్వర్యంలో శిశు గృహాల్లో ఆశ్రయం కల్పిస్తారన్నారు. విపత్తులు, ప్రమాదాల్లో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన పిల్లలు, భిక్షాటన చేసే పిల్లలు, పాక్షికంగా గాని, పూర్తిగా గాని వికలాంగ పిల్లలకు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ద్వారా బాల బాలికలను ప్రత్యేక వసతి గృహాల్లో చేర్పి ఆశ్రయం కల్పిస్తారన్నారు. ఇటువంటి వారు ఎవరైనా ఉంటే తమ కమిటీకి సమాచారం అందించాలన్నారు. ఇటీవల రైలులో తప్పిపోయిన బాలుడుకి పోలీసుల సహకారంతో ప్రభుత్వ వసతి గృహంలో ఆశ్రయం కల్పించామన్నారు. తల్లిదండ్రులు వస్తే వారిని విచారణ చేసి అప్పగించనున్నట్లు చెప్పారు.

కేసుల పరిష్కారంలో విశాఖ నాలుగో స్థానం

మెగా లోక్ అదాలత్ విజయవంతం



జిల్లా ప్రధాన న్యాయమూర్తి సమక్షంలో లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న బీమా కంపెనీ ప్రతినిధులు

విశాఖ లీగల్: జాతీయ మెగా లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంలో ఉమ్మడి విశాఖ జిల్లా రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచింది. జిల్లా కోర్టు ఆవరణలో శనివారం జరిగిన మెగా లోక్ అదాలత్‌ను విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు ప్రారంభించి, రాజీమార్గమే రాజ మార్గం అని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 36 బెంచ్‌లను ప్రధాన న్యాయమూర్తి సందర్శించారు. న్యాయవాదులు, సమాంతర న్యాయ సహాయకులు, న్యాయమూర్తులు అందిస్తున్న సేవలను ఆయన పర్యవేక్షించారు. ఈ మెగా లోక్ అదాలత్ ఉమ్మడి విశాఖ జిల్లాలోని విశాఖపట్నం, గాజువాక, అనకాపల్లి, యలమంచిలి, నర్సీపట్నం, అరకు, పాడేరు, చింతపల్లి ప్రాంతాల్లో కూడా జరిగింది. ఈ సందర్భంగా సహాయం అందించిన న్యాయవాదులు, అధికారులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజు అభినందించారు. కాగా.. మోటారు ప్రమాద కేసుల్లో రెండు బెంచ్‌లు కలిపి 124 కేసులను పరిష్కరించారు. నష్టపరిహారం కింద రూ.4.40 లక్షలు చెల్లించారు. ది న్యూ ఇండియా ఎస్యూరెన్స్ కంపెనీకి సంబంధించిన ఒక కేసులో లబ్ధిదారునికి రూ.53 లక్షల చెక్కును ప్రధాన న్యాయమూర్తి అందజేశారు. అలాగే సివిల్‌లో 185 కేసులు, క్రిమినల్‌లో 10,190 కేసులు, ప్రీ లిటిగేషన్‌లో 239 కేసులు రాజీ మార్గంలో పరిష్కారమయ్యాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. రాజీ మొత్తం విలువ దాదాపు రూ.25 కోట్లు అని, జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా జరిగిందని ఆయన వెల్లడించారు.

మినీ అంగన్‌వాడీలను అప్‌గ్రేడ్ చేయాలి





సమావేశంలో మాట్లాడుతున్న నాగశేషు, సమావేశానికి హాజరైన అంగన్‌వాడీ సిబ్బంది

- అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగశేషు

అనకాపల్లి: జిల్లాలో మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, లేని పక్షంలో మరో ఉద్యమం తప్పదని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగశేషు హెచ్చరించారు. యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు సీహెచ్.రామలక్ష్మి అధ్యక్షతన శనివారం స్థానిక దొడ్డి రామనాయుడు భవనంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగశేషు మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో 42 రోజుల సమ్మె చేసిన అంగన్‌వాడీ సిబ్బందికి ప్రస్తుత కూటమి ప్రభుత్వం మినీ అంగన్‌వాడీలను మెయిన్ సెంటర్లుగా మారుస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి 15 మాసాల్లో మరలా పోరాటం చేయడంతో కొన్ని మినీ సెంటర్లను అప్‌గ్రేడ్ చేశారన్నారు. రాష్ట్రంలో 1,810 సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి, జిల్లా నాయకులు ఎస్.వరలక్ష్మి, రమణి, మహాలక్ష్మి, రామలక్ష్మి, రమణి, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దారుణం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దండ సిద్ధార్థ, బొడ్డేడ లక్ష్మీనరసింహం

అనకాపల్లి: పేద విద్యార్థులకు మెడికల్ సీట్లు రావాలనే సంకల్పంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ఏర్పాటు చేసిన 17 మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం పీపీపీ పద్ధతిలో ప్రైవేటీకరణ చేయడానికి పూనుకోవడం దారుణమని వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు దండ సిద్ధార్థ ధ్వజమెత్తారు. స్థానిక రింగ్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌కు అప్పగిస్తే పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారన్నారు. 70 ఏళ్లలో 12 మెడికల్ కళాశాలలు ఉంటే, వైఎస్సార్‌సీపీ పాలనలో కొత్తగా 17 మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుట్టామన్నారు. అనకాపల్లి కేంద్రంగా మెడికల్ కళాశాల భవనానికి భూమి పూజ చేస్తే, స్థానికంగా ఉన్న కొంతమంది నాయకులు అడ్డుకోవడంతో నర్సీపట్నం మండలం మాకవరపాలెం గ్రామానికి తరలించారన్నారు. పార్టీ రాష్ట్ర వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహం మాట్లాడుతూ 17 మెడికల్ కళాశాలలను పీపీపీ పద్ధతిలో అప్పగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, దీనికి వ్యతిరేకంగా పేద విద్యార్థుల తరఫున పోరాటాలు చేస్తామన్నారు. రూ.5 లక్షలు పరిమితి ఉన్న ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.25లక్షల వరకూ పెంచుతూ పేద రోగులకు మేలు చేసిన ఘనత వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయడం ద్వారా స్థానిక ప్రజలకు పరోక్షంగా, ప్రత్యక్షంగా ఉపాధి కల్పించడమే కాకుండా పేద విద్యార్థులకు ఉచితంగా వైద్య విద్యను అభ్యసించే అవకాశానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, 80వ వార్డు ఇన్‌చార్జ్ కె.ఎం.నాయుడు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పరారీలో ఉన్న గంజాయి నిందితుడు అరెస్ట్



గంజాయి కేసు నిందితుడితో పోలీసులు

నర్సీపట్నం: ఐదేళ్లుగా పరారీలో ఉన్న నిందితుడిని రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. రూరల్ ఎస్ఐ రాజారావు కథనం ప్రకారం...2014లో రూరల్ పోలీసు స్టేషన్‌లో గంజాయి రవాణా కేసు నమోదైంది. ఈ కేసులో పల్నాడు జిల్లా కేంద్రమైన నర్సారావుపేట పట్టణంలోని రజాక్‌వాడకు చెందిన డ్రైవర్ షేక్ సుభాని(35) మొదటి నిందితుడిగా ఉన్నాడు. ఇతను ఐదేళ్లుగా కోర్టు విచారణకు హాజరు కావడం లేదు. దీంతో సాంకేతిక పరిజ్ఞానం ద్వారా చిరునామాను గుర్తించిన పోలీసులు, నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

మాలలను అణగదొక్కడానికే వర్గీకరణ



నిరసన చేస్తున్న రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు, తదితరులు

- రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు

అనకాపల్లి: రాష్ట్రంలో మాలలను అణగదొక్కడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేసిందని రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి చెన్నకేశవులు విమర్శించారు. కుప్పం నుంచి ఆయన ప్రారంభించిన రాజ్యాంగ పరిరక్షణ యాత్ర (కారు యాత్ర) శనివారం సాయంత్రం అనకాపల్లి నెహ్రూ చౌక్‌కు చేరుకుంది. అక్కడ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, ర్యాలీగా రైల్వే స్టేషన్ భీమునిగుమ్మం చేరుకుని అక్కడ నుంచి భీమునిపట్నం బయలుదేరి వెళ్లారు. అంతకు ముందు చెన్నకేశవులు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మాలలను విద్య, ఉద్యోగాలకు దూరం చేయడమే లక్ష్యంగా పాలన చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో టీడీపీకి సమాధి కట్టడం తప్పదని హెచ్చరించారు. మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్‌బాబు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ జీవోను ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లారపు లోవచంద్, డీవీఎంసీ జిల్లా సభ్యుడు రేబాక మధుబాబు, దళిత నాయకులు మఠ్రా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి హత్య కేసులో తనయుడి అరెస్ట్



నిందితుడిని మీడియా ముందు హాజరుపరిచిన డీఎస్పీ శ్రీనివాసరావు

నర్సీపట్నం: నాతవరం మండలం వై.బి.పట్నంలో జరిగిన తల్లి హత్య కేసులో తనయుడిని శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. మద్యానికి బానిసగా మారిన చిటికెల రామ్మూర్తినాయుడు(24) తన తల్లి బంగారు నగలు కోసం హత్యకు పాల్పడినట్టు పోలీసుల విచారణలో తేలింది. నర్సీపట్నం రూరల్ సర్కిల్ పోలీసు స్టేషన్‌లో శనివారం డీఎస్పీ శ్రీనివాసరావు వెల్లడించిన వివరాలు ప్రకారం.. హంతకుడు రామ్మూర్తినాయుడు తల్లిదండ్రులు నిద్రిస్తున్న సమయంలో మద్యం తాగి పెద్ద కేకలు వేస్తూ, తండ్రిని తోసేశాడు. తల్లి మంగ మెడలో బంగారు తాడు ఇవ్వకపోతే ఇద్దరిని చంపేస్తానని బెదిరించాడు. ఇవ్వడానికి నిరాకరించడంతో పూల కుండీతో తల్లి తలపై కొట్టి, మెడను కాలితో తొక్కి బంగారు తాడు తీసుకుని పారిపోయాడు. తీవ్ర గాయాలైన తల్లి అక్కడికక్కడే మరణించింది. ఫిర్యాదు అందిన వెంటనే సీఐ రేవతమ్మ సంఘటన స్థలానికి చేసుకున్నారు. పారిపోతున్న నిందితుడిని అదే మండలం గన్నవరం మెట్ట వద్ద అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు నుంచి 21 గ్రాముల బంగారు తాడు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో సీఐ రేవతమ్మ, ఎస్సై రాజారావు, గొలుగొండ ఎస్సై రామారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మట్టి రోడ్డులో ఇక్కట్లు



కశింకోట శాఖా గ్రంథాలయానికి వెళ్లే రోడ్డులో బురద

కశింకోట: స్థానిక శాఖా గ్రంథాలయానికి వెళ్లే దారి అధ్వానంగా ఉంది. ఏ మాత్రం వర్షం పడినా బురదమయంగా మారుతోంది. దీంతో గ్రంథాలయానికి రాకపోకలు సాగించడానికి పాఠకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. స్థానిక కోనేరు వద్ద ఉన్న గ్రంథాలయానికి జాతీయ రహదారి నుంచి చెరువు పక్కగా దారి ఉంది. ఇది మట్టి రోడ్డు కావడంతో వర్షం వచ్చిందంటే బురదగా మారడంతో పాఠకులను ఇక్కట్లకు గురి చేస్తోంది. దీని దృష్ట్యా సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేసి ఇబ్బందులు తొలగించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని పాఠకులు, స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా హిందీ దివస్



బాలికల వేషధారణ

కశింకోట: మండలంలో తాళ్లపాలెం గాయత్రి స్కూలులో శనివారం హిందీ దివస్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హిందీ వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కొందరు విద్యార్థులు హిందీ నాటికలను ప్రదర్శించి ఆహూతులను అలరించారు. కొందరు బాలికలు సంప్రదాయ వేషధారణలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బి. రామ్‌కుమార్, ప్రిన్సిపాల్ వై. నగేష్, హిందీ అధ్యాపకులు ఎ.ఎస్. విజయ్, ఎన్. సాయిస్వాతి, బి. కీర్తన పాల్గొన్నారు.

ధ్యాన వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ



కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారు శనివారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. వజ్ర కవచాలంకృతులతో పాటు వివిధ రకాల పూలు, తులసీమాలలతో అందంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. నక్షత్ర దీపం ఇచ్చారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 16 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	----	----
రెండో రకం	----	----
మూడోరకం	3,650	3,780

అనకాపల్లి సినిమాలు

రాజా	:మదరాసి
సత్యనారాయణ స్క్రీన్-1	:కిష్కింధపురి
సత్యనారాయణ స్క్రీన్-2	: కొత్త లోక
పర్తిసాయి	: ఘాటీ
షిర్డీసాయి	: కూలీ
వెంకటేశ్వర	: లిటిల్ హార్ట్స్
రామచంద్ర	: మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 51 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9, బీ పాజిటివ్-14, ఓ పాజిటివ్-25, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యాలోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 392 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 357 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.

వరిలో కలుపు.. చర్యలతో అదుపు


కలుపు నివారణకు చర్యలు...

వరి సాగు చేసే రైతులు వ్యవసాయ శాఖ సూచనలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు కలుపు మొక్కల నివారణకు ప్రత్యేక మందులను వినియోగించాలి. వరినాట్లు వేసిన మూడు నుంచి ఐదు రోజుల్లో ప్రెటిలాకోర్ ద్రావణం 500 మి.లీ లేదా అక్సాడయార్జిల్ 100 మి.లీ మందును నీటిలో కలిపి కరిగే గుళికలతో మిశ్రమం చేసి చల్లాలి. పెట్ సల్ఫ్యూరాన్ లేదా క్లోరిమ్యూరాన్ ఈథేల్ ఎనిమిది గ్రాముల మందును కలుపు రెండు నుంచి నాలుగు ఆకుల దశలో పిచికారీ చేయాలి. పెనాక్సులం లేదా సైహోలోపాస్ బ్యూటైట్ ద్రావణాన్ని 900 మి.లీ పిచికారీ చేస్తే అన్ని రకాల కలుపు మొక్కలు నిర్మూలించవచ్చు.

- యాజమాన్య పద్ధతులతో నివారణ
- ఆలస్యం చేస్తే పంట దిగుబడి ప్రభావం
- అనకాపల్లి మండలంలో 6,200 ఎకరాల్లో వరినాట్లు



తుమ్మపాలలో వరినాట్లు వేసిన పొలం



అనకాపల్లి: రైతుకు మంచి దిగుబడి రావాలంటే వరినాట్లు వేసిన తర్వాత నుంచి పొలంలో కలుపు మొక్కలు రాకుండా ప్రత్యేక దృష్టి సారించాలి. వరి సాగులో రైతులకు కలుపుతీత ప్రధానమైంది. సకాలంలో కలుపుతీత తీయడం ద్వారా నాణ్యతతో కూడిన అధిక దిగుబడులు సాధించవచ్చు. రైతులందరూ ఇటీవల ఎక్కువగా వెదజల్లు విధానంలో సాగు చేయడం వల్ల సాధారణంగా కలుపు అధికంగా ఉంటోంది. కలుపును వదిలేస్తే దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుంది. వరిపంటలో కలుపు నివారించడం ద్వారా నాణ్యమైన పంటలు పండించేందుకు అవకాశం ఉంటుంది. ప్రధానంగా సాగు చేసే పంటల్లో పెరిగే ఇతర గడ్డిమొక్కలనే కలుపు అంటారు. సాగుభూముల్లో ఈ మొక్కలు ప్రధాన పంట కంటే త్వరితగతిన పెరిగి పోషకాలు.. ఎరువులను స్వీకరించి పంట దిగుబడిపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. కలుపును నివారించకుంటే తెగుళ్ల బెడద ఎక్కువగా ఉండటంతో పాటు ఎరువులు, పురుగుమందుల వినియోగం ఎక్కువగా పెరిగిపోతుంది. నాణ్యమైన పంటలు పండించడంలో అధిక దిగుబడులు సాధించడంలో విఫలమయ్యే పరిస్థితులను రైతులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆశాజనకంగా సాగింది. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలో ఇంత వరకూ 6,200 ఎకరాల్లో వరి నాట్లు వేశారు. మరో 200 ఎకరాల్లో వరినాట్లు మరో రెండు రోజుల్లో పూర్తి కానున్నాయి.

అధికారుల సలహాలతో లాభదాయకం..

వరి నాట్లు వేసే ముందు, నెల రోజులు తర్వాత ప్రెటిలాకోర్ ఎకరా వంటలో లీటరు ఇసుకలో వెదజల్లడం వల్ల రైతుకు పంట మంచి దిగుబడి వస్తుంది. కలుపు మొక్కలో సాధారణంగా పంటకు ఎక్కువ హాని కలిగించే వాటిల్లో ఊదర, వెడల్పాకు, తుంగ, ఏక వార్షిక గడ్డి జాతులు ఉంటాయి. వీటి నివారణకు సాధ్యమైనంత మేరకు వ్యవసాయశాఖ సూచనల మేరకు క్రిమిసంహారక మందులను పిచికారీ చేస్తే సత్ఫలితాలు సాధిస్తారు. సాధారణంగా రైతులు పొలాల్లో నిర్ణీత సమయంలో కూలీలతో కలుపును తీయించేవారు. కూలీల కొరత ఎక్కువ కావడంతో పాలు, కూలీ రేట్లు గణనీయంగా పెరిగిపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులు అవలంబిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కలుపు నివారణకు అనేక రసాయన మందులను పిచికారీ చేయిస్తున్నారు. హెర్బిసైడ్ వంటి అనేక మందులు మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి. వ్యవసాయ నిపుణుల సూచనలు పాటించకుండా, రసాయన క్రిమిసంహారక మందులను అధికంగా రైతులు వినియోగిస్తే లాభం కంటే నష్టమే అధికంగా ఉంటుంది. కలుపు నివారణకు ఏ విధమైన మందులు, ఎంత మోతాదులో వినియోగించాలో రైతులకు అవగాహన ఉంటే, కలుపును పూర్తిగా నిర్మూలించి, అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

కలుపు మొక్కలు రావడం సహజం



ఏటా మా గ్రామంలో మూడెకరాల్లో వరి పంట వేస్తుంటాను. ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురవకపోవడంతో వరి నారుమళ్లు ఆలస్యంగా వేశాను. వరినాట్లు వేసిన వారం రోజులు తర్వాత పొలంలో పరిస్థితిని గమనిస్తాం. చిన్నచిన్న మొక్కలు ఉన్నట్లయితే మొదటి దశలో తొలగిస్తాం. ఎక్కువగా కలుపు ఉన్నట్లు తెలిస్తే మందులు వేస్తున్నాను. నెలకు ఒకసారి తప్పనిసరిగా వేస్తాను.

– పంచదార్ల కన్నారావు, రైతు, తుమ్మపాల, అనకాపల్లి మండలం

వరిలో తీసుకోవలసిన జాగ్రత్తలు...

ప్రస్తుతం మార్కెట్లో అనేక రకాల కలుపు మందులు లభిస్తున్నాయి. వరి పొలాల్లో పిచికారీ చేసే క్రిమిసంహారక మందును ఎంత మోతాదులో, ఏ సమయంలో వాడాలో అన్ని వివరాలు పూర్తిగా తెలుసుకుని తర్వాతే వాడాలి. సిఫారసు చేయని, పూర్తి వివరాలు తెలియని కలుపు మందులను ఎట్టి పరిస్థితుల్లో వాడరాదు. కలుపు నివారణకు ఎప్పుడు ఒకే రకమైన మందును వాడాలి. ఈ విధంగా చేయడం వల్ల రైతులకు వరి పంట దిగుబడి బాగుంటుంది.

కలుపుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి...



వరినాట్లు వేసిన తర్వాత పొలంలో నీటి నిల్వ ఎక్కువగా లేకుండా చూడాలి. కలుపు నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించాలి. ఒకే రకమైన మందులను వాడడం వల్ల పంట దిగుబడి వస్తుంది. ఎక్కువగా ఎరువులు వాడకూడదు. వర్షాలు పడుతున్న సమయంలో రైతులు వరినాట్లుపై ప్రత్యేక దృష్టి సారించి, 15 రోజులకు ఒకసారి పొలంలో పరిస్థితులను గమనించాలి. కలుపు ఉన్నట్లయితే తక్షణమే తొలగించాలి.

– పి.బి.రంగాచారి, మండల వ్యవసాయశాఖ అధికారి, అనకాపల్లి

ఢిల్లీ సదస్సుకు కొత్తూరు సర్పంచ్‌కు ఆహ్వానం



సర్పంచ్ సప్పారపు లక్ష్మీప్రసన్న

అనకాపల్లి: మండలంలోని మేజర్ పంచాయతీ కొత్తూరు సర్పంచ్ సప్పారపు లక్ష్మీప్రసన్నకు ఢిల్లీలో నిర్వహించే సంవాద్ సదస్సుకు ఆహ్వానం వచ్చింది. నేషనల్ క్వాలిటీ కాంక్లేవ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 15న సదస్సు జరగనుంది. దీనిలో జలశక్తి మంత్రిత్వ శాఖలో తాగునీరు, పారిశుధ్యం విభాగాల్లో క్వాలిటీ కౌన్సిల్ ఈ సదస్సు నిర్వహించనుంది. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 75 మంది సర్పంచ్‌లను ఆహ్వానించగా, వారిలో ఆరుగురు రాష్ట్రం నుంచి ఉన్నారు. వారిలో కొత్తూరు సర్పంచ్ ఒకరు. ఈ మేరకు ఆదివారం బయలుదేరారు.

సదస్సుకు కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. స్వచ్ఛ సుజల్, నారీ భల్ మిత్ర, సుశాసిత్ సమృద్ధి, సురక్ష, స్వస్తి, సంపన్న పంచాయతీల ప్రాతిపదికన ఎంపిక చేశారు. గ్రామీణాభివృద్ధికి కేంద్ర నిధులు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయి, గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం వంటి సమస్యలు, వాటిని ఎలా అధిగమించాలి, తదితర అంశాలపై చర్చించి సర్పంచ్‌ల అభిప్రాయాలను తెలుసుకోనున్నారు. రాష్ట్రంలోని అతి కొద్ది మందిలో ఒకరిగా తనకు ఈ అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉందని లక్ష్మీప్రసన్న తెలిపారు.

శారదా నదిలో తగ్గిన నీటి ప్రవాహం

కశింకోట: స్థానిక గవరపేటలో శనివారం శారదా నది నీటి ప్రవాహం తగ్గింది. దీంతో దోనె ప్రయాణాలు పునః ప్రారంభయ్యాయి. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో శుక్రవారం దోనె ప్రయాణాలు నిలిపి వేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నీటి మట్టం తగ్గినప్పటికి ఉధృతి ఎక్కువగా ఉన్నందున పరిమితంగానే రైతులను తమ పొలాలకు, పశువుల శాలలకు దోనెలపై వెళ్లడానికి అనుమతించారు. దీంతో మిగిలిన రైతులు ఇబ్బంది పడ్డారు. వారు ఎప్పటిలాగే గ్రామ శివారులో దూరంగా ఉన్న వంతెన మీదుగా తమ పొలాలకు నడిచి చేరుకుని వ్యవసాయ కార్యకలాపాలు నిర్వహించుకోవల్సి వచ్చింది.

వేల్పులవీధిలో అన్నసమారాధన



అన్నసమారాధనలో కమిటీ సభ్యులు, భక్తులు

అనకాపల్లి: స్థానిక వేల్పులవీధి వి-స్టార్ గైస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 36 అడుగుల గణపతి మండపం వద్ద శనివారం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. ఈ నెల 17వ తేదీన గణపతి విగ్రహ నిమజ్జనం చేయనున్నారు. ఇందులో భాగంగా అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

యువత దైవభక్తి అలవర్చుకోవాలి

126 అడుగుల లక్ష్మీగణపతిని దర్శించుకున్న అమర్‌నాథ్



లక్ష్మీగణపతిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



బుద్ధ భూలోకనాయుడ్ని పరామర్శిస్తున్న అమర్‌నాథ్

అనకాపల్లి: యువత దైవభక్తి అలవర్చుకోవాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ఆకాంక్షించారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో సంపత్ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 126 అడుగుల లక్ష్మీ గణపతిని శనివారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో భారీ వినాయకుని అనకాపల్లిలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, నూకాంబిక అమ్మవారి దేవస్థానం మాజీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, పార్టీ నాయకులు దాడి నారాయణరావు, బొండా వాసు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భూలోకనాయుడుకు పరామర్శ

రాజకీయ నాయకుడు, 126 అడుగుల గణపతి వ్యవస్థాపకుడు బుద్ధ భూలోకనాయుడు కుమార్తె కీర్తి ఇటీవల మరణించిన విషయాన్ని తెలుసుకుని స్థానిక గవరపాలెంలో ఆయన స్వగృహానికి వెళ్లి మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాలు వినియోగించుకోవాలి



హాజరైన అభ్యర్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఉద్యోగ మేళాలు నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరారు. పట్టణంలోని జీవీఎంసీ పెద్ద హైస్కూల్ ఆవరణలో శనివారం నిర్వహించిన ఉద్యోగ మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీల ప్రతినిధుల ఇంటర్వ్యూలను పరిశీలించి, అభ్యర్థులతో మాట్లాడారు. ఈ మేళాలో 30 ప్రైవేటు కంపెనీలు పాల్గొనగా, 1560 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 587 మంది ఆయా కంపెనీల్లో వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి డాక్టర్ ఎన్. గోవిందరావు, డీపీవో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న సూపరింటెండెంట్ నరసింగరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శుక్రవారం హైదరాబాద్‌లోని మియాపూర్‌కి చెందిన పి.రాము లక్ష రూపాయల విరాళం నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరపున దాతకు అన్నప్రసాద విభాగం సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు బాండ్ అందజేశారు. ఆలయ అధికారులు స్వామి వారి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు.

వలంటీర్ వ్యవస్థ ప్రజా సేవలకు అవసరమే



టీడీపీ సీనియర్ నాయకుడు గండి సింహాద్రి

రోలుగుంట : వైఎస్సార్‌సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి ప్రజలకు చేరువలో అన్ని రకాల సేవలందించే మంచి ఆలోచనతో వలంటీర్ వ్యవస్థ రూపకల్పన చేసి అమలు చేశారని, వలంటీర్ వ్యవస్థ ఉండాల్సిందేనని టీడీపీ సీనియర్ నాయకుడు గండి సింహాద్రి అన్నారు. పంచాయతీస్థాయి పాలనలోను, నాయకత్వం తీరులో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. శనివారం ఆయన జేపీ అగ్రహారం గ్రామస్తులకు సంబంధించి భూ సమస్యలతో పాటు పలు అంశాలపై విలేకరులతో మాట్లాడారు. రైతులు భూ సమస్యల పరిష్కారంపై అవగాహన పెంచుకోవాలన్నారు. రికార్డులు రెవిన్యూ అధికారుల ఆధీనంలో ఉంటాయని, ప్రజాప్రతినిధులే రికార్డులు మార్పించారని అనడం సరికాదన్నారు. ఆర్డీవో స్థాయిలోనూ, భూములు కొనుగోలు చేసిన వారితో గ్రామస్తులు చర్చించారని, ఇరువర్గాల వారికి తనకు తోచిన సలహా మాత్రమే ఇచ్చానని, రైతులకు అన్యాయం చేసే ఆలోచన తనకు లేదన్నారు. భూ సమస్య పరిష్కారంపై ఎమ్మెల్యే రాజు ఎన్నికల ముందు హామీ ఇచ్చారని, ఎమ్మెల్యే పూర్తి స్థాయి బాధ్యత తీసుకొని రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి టౌన్: ప్రపంచ వ్యాప్తంగా మితవాద శక్తుల ప్రాబల్యం పెరుగుతున్న నేపథ్యంలో వాటిని ఎదుర్కొనేందుకు సీతారాం ఏచూరి స్ఫూర్తితో ప్రజా పోరాటాలు సాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ కార్మిక, కర్షక రంగాల హక్కుల సాధనతోపాటు లౌకిక పరిరక్షణ ఉద్యమాల్లో తుది శ్వాస వరకు పోరాటాలు చేశారని కొనియాడారు. ప్రజాస్వామ్య శక్తులను ఏకం చేసి దేశ ఐక్యత కోసం తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రుత్తల శంకర్రావు, జిల్లా అధ్యక్షుడు వీవీ శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి 18 వరకు జిల్లా స్థాయి చెడుగుడు పోటీలు

మునగపాక: మరిడిమాంబ అమ్మవారి పండగను పురస్కరించుకుని మునగపాకలో ఈ నెల 16 నుంచి 18 వరకు జిల్లా స్థాయి చెడుగుడు పోటీలు నిర్వహించనున్నట్టు డాన్‌జిమ్ అధినేత పెంటకోట విజయ్ తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జిల్లా స్థాయిలో చెడుగుడు పోటీలు నిర్వహిస్తున్న జూనియర్ హైటెక్ సభ్యులను అభినందించారు. సంతబయిల రామాలయ ప్రాంగణంలో మూడు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీలను విజయవంతం చేయాలన్నారు. ఎంట్రీ ఫీజుగా రూ.200 చెల్లించాలన్నారు. ఆడారి వెంకటేష్, దొడ్డి సాయి, టెక్కలి శివ గణేష్, కర్రి శివ, టెక్కలి యోగి, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు ప్రయోజకులు అయ్యేలా తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి



దిబ్బిడిలో విద్యార్థి చదువుల గురించి తల్లిదండ్రులను ఆరా తీస్తున్న ఉపాధ్యాయుడు మూర్తి



నేతవానిపాలెంలో విద్యార్థి తల్లితో మాట్లాడుతున్న మూర్తి

బుచ్చెయ్యపేట : తల్లిదండ్రులు తమ పిల్లలు ప్రయోజకులు అయ్యే వారి ఉన్నత చదువులకు తగిన చేయూత నివ్వాలని దిబ్బిడి జిల్లా పరిషత్ హై స్కూల్ గణిత ఉపాధ్యాయుడు ఎ.వి.ఎస్ మూర్తి కోరారు. దిబ్బిడి, నేతవానిపాలెం, బుచ్చెయ్యపేట, పోలేపల్లి గ్రామాల్లో పలువురు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి చదువుల గురించి తల్లిదండ్రులతో మాట్లాడారు. హైస్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు ఇటీవల కాలంలో పాఠశాలకు గైర్హాజరవుతున్నారు. ఎక్కువ రోజులు పాఠశాలకు రాని విద్యార్థులను గుర్తించిన గణిత ఉపాధ్యాయుడు మూర్తి శనివారం ఉదయం 7 గంటలకే ఆయ విద్యార్థుల ఇళ్లకు వెళ్లారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాయాల్సిన మీ పిల్లలను ఎందుకు స్కూల్‌కు పంపించడం లేదని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. పలువురు తల్లిదండ్రులు పొలం పనులు ఎక్కువగా ఉన్నప్పుడు పాఠశాలకు పంపించడం లేదని తెలిపారు. దీంతో విద్యార్థులకు ప్రతి రోజూ బోధించే పాఠాలు వినకపోతే వారు చదువులో వెనకబడి పోతారని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. తమ పిల్లలు ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానాలకు వెళ్లి ప్రయోజకులు అవ్వాలని తల్లిదండ్రులు కలలు కనాలన్నారు. విద్యార్థి మేలుకో కార్యక్రమంలో భాగంగా 30 మంది విద్యార్థుల ఇళ్లను సందర్శించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనారోగ్యంతో ఉన్నవారికి మిగిలిన విద్యార్థులకు ఉపాధ్యాయుడు మూర్తి తన సొంత నిధులతో డ్రైఫ్రూట్స్ ప్యాకెట్లు అందించారు.

ఆదర్శంగా నిలిచిన స్నేహబంధం



చిలుకునాయుడుకు సాయం అందిస్తున్న స్నేహితులు

అచ్యుతాపురం రూరల్ : ఆపదలో ఆదుకునే వారే స్నేహితులని అచ్యుతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1998–1999 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు నిరూపించారు. బుచ్చయ్యపేట మండలం ఆర్.శివరామపురానికి చెందిన దేవర చిలుకునాయుడు అచ్యుతాపురం హైస్కూల్‌లో 1998–99 బ్యాచ్‌తో కలిసి చదువుకున్నారు. ఈయన దివ్యాంగుడైనప్పటికీ విద్యాభ్యాసం, ఆటపోటీల్లో చురుగ్గా ఉండేవారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఈయన కుటుంబం ఛిన్నాభిన్నమైంది. చిలుకునాయుడు తన భార్య, చిన్న కుమార్తెను మూడు చక్రాల వాహనంపై ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో జరిగిన ప్రమాదంలో భార్య మృతి చెందగా, ఆయన కాలు, చేయి విరిగిపోవడంతో మంచానికే పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న తన స్నేహితులు సుమారు రూ.87వేలు సేకరించి బాధితుడికి శనివారం అందజేశారు. భవిష్యత్తులో ఎటువంటి అవసరమైనా తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు.